క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: సత్తుపల్లి సెక్షన్ పరిధిలోని సత్తుపల్లిటౌన్–2 ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్, రఘురాం ఆస్పత్రి రోడ్డు, కల్పతరురోడ్డు, రామాలయం రోడ్డు, అవని వెంచర్, టౌన్–1 ఫీడర్‌లోని విద్యానగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

అంకమ్మ తిరునాళ్లలో 'రడకప్పెర'


రడకప్పెర నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని బేతుపల్లి శ్రీ అంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా మంగళవారం రడకప్పెర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

నేడు రామలింగేశ్వర స్వామి కల్యాణం

తల్లాడ: మహాచైత్రి సందర్భంగా బుధవారం స్థానిక రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గంగా పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కంచెల సతీష్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 8 గంటల నుంచి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరగనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కల్యాణమూర్తుల ఊరేగింపు, పంచామృత నవరస మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరుగుతాయని తెలిపారు.

నేడు దూలమ్మ కల్యాణం

వైరారూరల్: మండలంలోని దాచాపురం, గన్నవరం కూడలిలో గల దూలమ్మ తల్లి దేవస్థానంలో బుధవారం ఉదయం దూలమ్మ, దూలయ్య కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 6, 7 తేదీల్లో రెండు తెలుగు రాష్ట్రాల ఎడ్ల పోటీల బలపదర్శన, ట్రాక్టర్ రివర్స్ పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

'విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి'

కొణిజర్ల: వరసగా రెండు రోజులు పదో తరగతి ప్రశ్నాపత్రాలు లీకు కావడం సంఘటనలపై బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యా శాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డి రాజీనామా చేయాలని ఎంపీపీ గోసు మధు డిమాండ్ చేశారు. కొణిజర్లలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రూపు–1 ప్రశ్నా పత్రాల లీకేజీతో నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న ప్రభుత్వం ఘటనను మరిచిపోక ముందే టెన్త్ ప్రశ్నాపత్రాలు లీకేజీ సంఘటనలు బయటకు వస్తున్నాయన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఇదంతా జరుగుతుందన్నారు. సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. లీకేజీలపై ప్రశ్నిస్తున్న నాయకులకు సిట్ నోటీసులు జారీ చేయడం సరికాదన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంటింటికీ టీడీపీ

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం గ్రామంలో మంగళవారం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కూరపాటి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ వాసిరెడ్డి రామనాథం, మండలాధ్యక్షుడు దోమందుల సామేలు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రారంభించారు. తొలుత గ్రామంలోని స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. నాయకులు వాసిరెడ్డి శివకుమారి, మల్లాది హనుమంతరావు, గురిజాల సత్యనారాయణ, గుత్తా సీతయ్య, మల్లిక, రామారావు, వెంకటేశ్వరరెడ్డి, వీరమాచినేని కృష్ణారావు, దేవబత్తిని శేషగిరి, పాల్గొన్నారు.

నివాళి..

చింతకాని: మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ పార్టీ సీనియర్ నాయకురాలు మాచర్ల రాములమ్మ (80) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఈ మేరకు ఆమె మృతదేహాన్ని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్‌రావు, వేమిరెడ్డి సీతారామిరెడ్డి, అవులూరి రామిరెడ్డి, బక్కిరెడ్డి, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, వేముల జానికి రాములు, గ్రామసర్పంచ్ వేమిరెడ్డి తిరుపతమ్మ, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రైల్వే గేట్లు.. తప్పని పాట్లు

- ఆర్వోబీలు లేక ఏళ్ల తరబడి అవస్థ
- గేట్ వేస్తే గంటల తరబడి నిరీక్షణ
- సమయం వృథా అవుతోందని పలువురి ఆవేదన


ఎర్రుపాలెంలో రైల్వేగేటు వద్ద నిలిచిన వాహనాలు

ఎర్రుపాలెం: ప్రధాన రహదారులపై రైల్వేశాఖ నిర్మించిన రైల్వేగేట్లతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. గేట్ల వద్ద నిరీక్షణతోనే సమయం వృథా అవుతోందని ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంలోని రైల్వేగేటు, ఎర్రుపాలెం టూ రేమిడిచర్ల గ్రామానికి (విజయవాడ వైపు) వెళ్లే రహదారిలోని మరో రెండు రైల్వే గేట్లు ఉన్నాయి. ఈ గేట్ల వద్ద ప్రయాణికులు పడే అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఈ రైల్వేగేట్ల వద్ద అప్‌లైన్ ట్రాక్, డౌన్ లైన్ ట్రాక్‌లు ఇప్పటికే ఉండగా, తాజాగా మూడో రైల్వే లైన్ నిర్మించారు. ఈ మార్గంలో నిమిషాల వ్యవధిలో రైళ్లు వచ్చివెళ్తుండడంతో తరచుగా రైల్వే గేట్ వేయడం ఆనవాయితీగా మారింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఒక్కోసారి అరగంటకు పైగా వేచి ఉండాల్సి వస్తోంది. సాధారణ సమయంలోనైతే ఫర్వాలేదు కానీ ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను లేక అనారోగ్యానికి గురైన వారిని ఖమ్మం, విజయవాడ ఆస్పత్రులకు తీసుకెళ్లే సమయాన ఆలస్యం జరిగి ప్రాణాలు పోతున్నాయి. అలాగే, కార్యాలయాలు, పాఠశాలలకు వెళ్లాల్సిన సమయాన గేట్లు వేసి ఉండటంతో వాహనాలు నిలిచిపోయి అటు ఉద్యోగులు, ఇటు విద్యార్థులు కార్యాలయాలు, పాఠశాలలకు సరైన సమయానికి చేరుకోలేకపోతున్నారు.

విన్నవించినా....

మూడో రైల్వే లైన్, నూతన రైల్వే స్టేషన్ నిర్మాణ పనుల పరిశీలనకు ఇటీవల వచ్చిన రైల్వే డీఆర్‌ఎంకు స్థానికులు ఈ సమస్యపై మొరపెట్టుకున్నారు. ఆర్వోబీ నిర్మాణాలు చేపడతామని ఆయన హామీ ఇచ్చి వెళ్లిపోయారు. అయితే, గతంలోనూ ఇలాగే హామీలు ఇచ్చినా నెరవేరలేదని స్థానికులు గుర్తు చేస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఉన్నతాధికారులకు కూడా పలుమార్లు రైల్వే గేట్లతో సమస్య ఎదురైనా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, రైల్వే ఉన్నతాధికారులు స్పందించి రైల్వే గేట్లపై ఆర్వోబీలు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సమయం వృథా అవుతోంది..



రైల్లే గేట్ల వద్ద ఎక్కువ సమయం వృథా అవుతోంది. ప్రతిరోజు గేటు మీదుగానే మండలకేంద్రంలోని దుకాణాలు, కళాశాల, పాఠశాలలు, ఆస్పత్రులకు వెళ్లాల్సి ఉంది. ఈ సమస్య ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ ఎవరికీ పట్టడం లేదు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఆర్వోబీ నిర్మించాలి.

– గద్దల శ్రీనివాసరావు,
కళాశాల అధ్యాపకులు, ఎర్రుపాలెం

ఆర్వోబీలు నిర్మిస్తేనే మేలు



మండల కేంద్రం రేమిడిచర్లకు వెళ్లే దారిలో ఉన్న రెండు గేట్ల వద్ద బాగా ఇబ్బంది పడుతున్నాం. కొద్ది దూరంలోనే రెండు గేట్లు ఉండటంతో ప్రయాణంలో ఆలస్యమవుతోంది. ఈ రైల్వే గేట్ల వద్ద ఆర్వోబీ నిర్మిస్తేనే సమస్య పరిష్కారం అవుతుంది. ఇప్పటికైనా రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– ముక్కపాటి శ్రీనివాసరావు,
వాహనదారుడు, రేమిడిచర్ల

'కంటివెలుగు' దేశానికే ఆదర్శం


శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం దేశంలో ప్రతీ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో 11 వార్డు సోమవరం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న తీరును ఆయన పరిశీలించారు. కంటి వెలుగు శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు మద్దెల రవి, వార్డు కౌన్సిలర్ దారెల్లి పవిత్రకుమారి, డాక్టర్ డి.కోటయ్య, బీబా సాహెబ్, పి.మోహనరావు, బీడీకే రత్నం, హన్మంతరావు, శ్రీను, శివ, సురేష్, మనోహర్ పాల్గొన్నారు.

పక్కదారి పట్టించేందుకే ఆత్మీయ సమ్మేళనాలు


సత్తుపల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న మానవతారాయ్

తల్లాడ: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య చేస్తున్న ఆత్మీయ సమ్మేళనాలను వెన్నుపోటు సమ్మేళనాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ అన్నారు. మండలంలోని కుర్నవల్లి గ్రామంలో మంగళవారం గడగడపకూ హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రజలను పక్కదారి పట్టించేందుకే ఆత్మీయ సమ్మేళనాలు చేపట్టి ప్రజల్ని వంచిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఏమి అమలు చేయకుండా ప్రజల్ని మభ్యపెడుతూ కాలం వెళ్లదీస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలో కొస్తే రూ.500 కే గ్యాస్ సిలిండర్, రూ.2 లక్షల రుణమాఫీ, పేదింటికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గంలో వంద గజాల చొప్పున పంచుతామని, సత్తుపల్లిలో థర్మల్ పవర్ స్టేషన్ నిర్మించి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం సిద్ధారెడ్డి, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ కార్యదర్శి రావి నాగేశ్వర్‌రావు, అయిలూరి వెంకటేశ్వర్‌రెడ్డి, గంటల వెంకటాచారి, దేశిరెడ్డి సత్యనారాయణ, గుర్రాల లక్ష్మారెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, వెన్నపూస చిన్న వెంకటరెడ్డి, వేమిరెడ్డి కోటారెడ్డి, కొమ్మేపల్లి ఖలీల్, దామాల రాజు, గోపిరెడ్డి, రాజబోయిన ప్రసాదరావు పాల్గొన్నారు.

మానవతారాయ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

సత్తుపల్లి: పట్టణంలోని రాజీవ్ కాలనీకి చెందిన పలు కుటుంబాలు మంగళవా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మానవతారాయ్ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు రామిశెట్టి సుబ్బారావు, ఐ.కృష్ణ, కె.కాంతారావు, బి.వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, ప్రసాద్ పాల్గొన్నారు.

రాములోరి తలంబ్రాల పంపిణీ ప్రారంభం


తలంబ్రాలు పంపిణీ చేస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ముత్యాల తలంబ్రాల పంపిణీ కార్యక్రమాన్ని సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి మంగళవారం డిపో కార్యాలయంలో మంగళవారం ప్రారంభించారు. ఆర్టీసీ ఎండీ సజ్జన్నార్ చేపట్టిన రూ.116లకే ఇంటి వద్దకు ముత్యాల తలంబ్రాలు పంపిణీ కార్యక్రమం సత్తుపల్లి డిపోలో విజయవంతమైందన్నారు. ముత్యాల తలంబ్రాలు సత్తుపల్లి డిపోకు చేరుకోవటంతో డిపో లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటీవ్ ఎస్‌కె.మునీర్‌పాషా ఆధ్వర్యంలో లాంఛనంగా పంపిణీ నిర్వహించారు. డిపో పరిధిలో ముత్యాల తలంబ్రాలు బుక్ చేసుకున్నవారి ఇళ్ల వద్దకు వెళ్లి అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, సూపరింటెండెంట్ జయరాజు, ఏడీసీ సుబ్బారావు, సిబ్బంది డీఎస్ రావు, మోహన్‌బాబు, బిఎస్ రావు పాల్గొన్నారు.

రైలుపట్టాలు దాటొద్దు


అవగాహన కల్పిస్తున్న ప్రసన్న కుమార్

మధిర: రైలు పట్టాలు దాటుతూ అనేకమంది ప్రమాదాలకు గురవుతున్నారని సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.ప్రసన్న కుమార్ తెలిపారు. మధిర రైల్వే స్టేషన్, రైల్వే గేట్ ప్లాంతాల్లో రైలు పట్టాలు దాటుతున్న ప్రయాణికులకు మంగళవారం అవగాహన కల్పించారు. ప్రయాణికులు కాలి వంతెనపై, రైల్వే ఓవర్ బ్రిడ్జి దగ్గర మాత్రమే రైల్వే పట్టాలను దాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఎస్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నృత్యంతో ఆరోగ్యం


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏసీపీ రామానుజం

సత్తుపల్లిరూరల్: నృత్యం ఆనందాన్ని, ఉత్సాహాన్ని పెంచి మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కలుగుతుందని, శరీర కదలికలు కారణంగా బరువు తగ్గి పనితీరు మెరుగుపడి రోగనిరోధక శక్తి మెరుగుపడుతుందని ఏసీపీ రామానుజం అన్నారు. విశ్వశాంతి విద్యాలయంలో డాన్స్‌లో శిక్షణ పొందిన 150 మంది విద్యార్థులతో మంగళవారం 'నృత్యోత్సవం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ రామానుజం మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఆరోగ్యాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. విశ్వశాంతి ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐ టి.కరుణాకర్, సత్యనారాయణ, మాస్టర్లు గణేష్, మంజూష, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రత్నమనోహర్

పెనుబల్లి : పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో డాక్టర్ రత్నమనోహర్ సిబ్బందికి, ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు, మంగళవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కృత్రిమ శ్వాసలను ఇవ్వడం, ఛాతి నొక్కడం, గుండె శరీరంలోని మిగిలిన భాగాలకు రక్తాన్ని చేరవేయగలదని, ఇది వ్యక్తి యొక్క గుండె ఊపిరితిత్తులు ఆగిపోయిన తరువాత ఒక వ్యక్తిని సజీవంగా ఉంచడానికి సహాయపడుతుందన్నారు. ఇవి అత్యవసర వైద్య సేవలు అందే వరకు నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ'ను సద్వినియోగం చేసుకోండి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

వైరా: మహిళలంతా ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూఓ సంధ్యారాణి సూచించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు ఎనిమిది రకాల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని ఖమ్మం ప్రధాన ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీపీఓ విష్ణు వందన, సీడీపీఓ శాంతి సుధ, వైద్యాధికారులు డాక్టర్ ఉదయలక్ష్మి, దేవీశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాలతీ, బీజాన్‌బీ, ఏఎస్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అక్రమాలపై విచారణ చేయాలి


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: వైరా మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమాలపై స్వతంత్ర సంస్థ ద్వారా సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మంగళవారం వైరా సీపీఎం కార్యాలయంలో బోడపట్ల రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన వైరా పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైరా మున్సిపాలిటీ జరుగుతున్న అవినీతి అక్రమాలపై రోజూ పత్రికలలో వార్తలు వస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. వెలుగులోకి తీసుకొచ్చి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, నాయకులు బొంతు సమత, హరి వెంకటేశ్వరరావు, పి సాంబశివరావు, జి రజిత, మోహనరావు, నరసయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు సాధించే వరకు ఉద్యమం



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లిరూరల్: పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు సాధించే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి స్పష్టం చేశారు. మంగళవారం పార్టీ మండల కార్యదర్శి జాజిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిదేళ్లు కావస్తున్నా, ఇప్పటి వరకు ఆ ఊసేలేదని విమర్శించారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. లక్ష్మణ్‌రావు, కుమారస్వామి, శ్రీను, రామకృష్ణ, శ్రీకాంత్, ఏసుమణి, విష్ణు, రవి, వాసు, నరేష్ పాల్గొన్నారు.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి


మాట్లాడుతున్న శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్: చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో రెండోరోజు మంగళవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తుపల్లికి చెందిన ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. వెంటనే పార్లమెంట్‌లో బీసీ బిల్లును పెట్టి చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ ఉద్యోగుల ప్రమోషన్లు, రిజర్వేషన్లు అమలు చేయాలని, క్రిమిలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, ఢిల్లీ ఇన్‌చార్జ్ కర్రీ వేణుమాధవ్, యువజన విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నీలం వెంకటేష్, జాతీయ ఉపాధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్, రాష్ట్ర అధ్యక్షులు రాజేందర్, అనంతయ్య, జిల్లపల్లి అంజి, వేముల రామకృష్ణ, రామాచారి, భూపేష్‌సాగర్ పాల్గొన్నారు.


క్రీడలతో మానసికోల్లాసం


కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ

తల్లాడ: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం పడుతాయని వైరా సీఐ టి.సురేష్ అన్నారు. మండలంలోని కుర్నవల్లిలో వేంకటాచలపతి దేవాలయం ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల ఐకమత్యం, స్నేహభావం పెరుగుతుందన్నారు. కుర్నవల్లిలో వేంకటా చలపతి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కుర్నవల్లి సొసైటీ అధ్యక్షుడు అయిలూరి ప్రదీప్‌రెడ్డి, ఎస్సై సురేష్, సర్పంచ్ అయిలూరి లక్ష్మ, ఉపసర్పంచ్ పోతురాజు వెంకటయ్య, దేవాలయం కమిటీ చైర్మన్ అయిలూరి శేషిరెడ్డి, అయిలూరి బాబు, కట్టా దర్గయ్య, గంటల వెంకటాచారి పాల్గొన్నారు.

'పది' పరీక్షా కేంద్రాల పరిశీలన


మధిర: పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన అధికారులు


ముదిగొండ: మేడేపల్లి పరీక్షా కేంద్రం వద్ద..

మధిర: మండలంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి, ఎంపీడీఓ కుడుముల విజయభాస్కర్ రెడ్డి, ఎంఈఓ వై.ప్రభాకర్ పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులతో పాటు ఎలాంటి మాస్ కాపీయింగ్ జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండో రోజు జరిగిన పరీక్షకు 1037 మంది హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారని ఎంఈఓ తెలిపారు.

ముదిగొండ: ముదిగొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావు మంగళవారం తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని అన్ని గదులను వసతులను ఎంపీడీఓ పరిశీలించారు. ముదిగొండ, మేడేపల్లిలోని పరీక్షా కేంద్రాలను ఎస్ఐ నరేష్ తనిఖీ చేశారు. మండలంలోని 538 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగ ఇద్దరు గైర్హాజరైనట్టు ఎంఈఓ ఇందిరాజ్యోతి తెలిపారు.

చింతకాని: మండల పరిధిలోని పందిళ్లపల్లి పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ మోదుగు శ్యాంసన్ తనిఖీ చేశారు.

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం, బనిగండ్లపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మూడు పరీక్షా కేంద్రాల్లో హిందీ పేపర్ పరీక్షకు 511 మంది హాజరుకాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు పర్యవేక్షించగా ఎస్ఐ ఎం.సురేష్ బందోబస్తు నిర్వహించారు.

టేకు దుంగలు లభ్యం

కల్లూరు: మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో కె.ప్రభాకర్‌రెడ్డి ఇంటి పెరడులో గడ్డివాములో దాచిన ఆరు టేకు దిమ్మెలను మంగళవారం ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.40 వేల వరకు ఉంటుందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. దర్యాప్తు చేస్తున్నట్లు డీఆర్‌ఓ నాగమణి స్పష్టం చేశారు.



అటెన్షన్ ప్లీజ్

వానరాలతో ఇక్కట్లు



మధిర మండలంలోని మల్లవరం గ్రామంలో వానరాల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పత్తి, మొక్కజొన్న పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులు, వ్యవసాయ కూలీలు ఆ మార్గంలో వెళ్లాలంటే భయపడుతున్నారు. ఒక్కోసారి ఇంట్లో నుంచి బయటకు కూడా వచ్చే పరిస్థితి లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– మధిర

ప్రశ్నించాల్సిన అధికారి : విజయ భాస్కర్‌రెడ్డి,
ఎండీఓ, మధిర
సెల్ నంబర్ :7020702179